

యనమలకుదురులో ప్రభల మహోత్సవం (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న రామలింగేశ్వరస్వామి

భూకైలాస్

శివనామస్మరణతో శైవక్షేత్రాలు శోభాయమానమయ్యాయి. పుణ్యస్నానాలతో కృష్ణాతీరాలు పులకించిపోయాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడగా, స్నానఘాట్లు కళకళలాడాయి. అర్ధరాత్రి దాటాక ఇంద్రకీలాద్రిపై ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగగా, యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రభలు ప్రకాశవంతమై వెలిగాయి.



- ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు
- ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల కల్యాణ వేడుకలు
- యనమలకుదురులో వైభవంగా ప్రభల ఉత్సవం
- కిటకిటలాడిన శివాలయాలు.. కళకళలాడిన స్నానఘాట్లు

6

ఓటే శాసనం..!

నేడే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

- జిల్లావ్యాప్తంగా 63,114 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలు 77.. సమస్యాత్మకమైనవి 42
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్

నేడు అన్ని విద్యాసంస్థలకు సెలవు



మచిలీపట్నం నోబుల్ కళాశాలలో పోలింగ్ సిబ్బంది

శాసనమండలి సమరానికి సర్వంసిద్ధమైంది. జిల్లాలో ఏర్పాటు చేసిన 77 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల సిబ్బందితో పాటు ఓటింగ్ సామగ్రి కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించగా, విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవు ప్రకటించారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సరళిని యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మచిలీపట్నం నోబుల్ కళాశాలతో పాటు గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాల వద్ద ఎన్నికల మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ బాలాజీ బుధవారం పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. పోలింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఉదయం 8 గంటల నుంచి పోలింగ్

గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. జిల్లాలో 63,114 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 35,321 మంది కాగా, మహిళలు 27,789 మంది. మరో నలుగురు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని మచిలీపట్నం మిగతా 6లో..

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

సత్యవర్ధన్ బెదిరింపుల ఎపిసోడ్ పథకం ప్రకారమేనా?

నాడు వంశీ కలిసిన వైసీపీ ముఖ్య నేతలు ఎవరు?

- విచారణలో పోలీసుల ప్రశ్నలతో బలపడుతున్న అనుమానాలు
- తాడేపల్లి పెద్దల సూచనతోనే నాడు టీడీపీ ఆఫీసులపై దాడులు
- సత్యవర్ధన్‌ను తమవైపు తిప్పుకొనే ప్లాన్ కూడా వారిదేనా..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ మూకల దాడి ఘటనలో ప్రత్యక్ష సాక్షి, ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో తాడేపల్లి వైసీపీ పెద్దల పథక రచన ఉందా..? అంటే అవుననే సందేహం కలగకమానదు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విచారణ సందర్భంగా పోలీసులు అడుగుతున్న ప్రశ్నలను పరిశీలిస్తే.. ఇదే అనుమానం కలుగుతుంది. సత్యవర్ధన్.. హైదరాబాద్‌లోని మిగతా 6లో..

దుర్గామల్లేశ్వరులకు మంగళగిరి చేనేత పట్టువస్త్రాలు

6లో

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- నాగులేటి వద్ద మంత్రి కొల్లు రవీంద్ర పుణ్యస్నానాలు

6లో

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సరళి

- గుడివాడ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ బాలాజీ


పవిత్రసంగమం వద్ద భక్తుల పుణ్య స్నానాలు


ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యనదుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, ఉపవాసాలు చేసి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.


సంగమేశ్వరుడు

హరోం హర




ముక్త్యాల వద్ద భక్తుల జల్లు స్నానాలు

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

- తెల్లవారుజాము నుంచే లక్షలాదిగా భక్తుల పుణ్యస్నానాలు
- మహా శివరాత్రి నాడు శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమ ప్రదేశం
- జనసంద్రంలా పెదకళ్లేపల్లి, ముక్త్యాల, సంగమేశ్వరాలయం

యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పెనమలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు మునిగిరిపై శ్రీరామలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు శివపార్వతులను దర్శించి తరించారు. బుధవారం ఉదయం ఆదిదంపతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పదులసంఖ్యలో ఏర్పాటు చేసిన ప్రభలు విద్యుత్ కాంతులీనాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రోజంతా భక్తులను స్వామివారి దర్శనార్థం అనుమతించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. స్వామివారికి అర్చకులు పంచామృతాలతో తైలాభిషేకాలు, రుద్రాభిషేకాలు, మహారుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి బిల్వార్చన, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 11గంటలకు గ్రామ మండపం వద్ద దేవస్థానప్రభకు ఎడ్లు కట్టి ఊరేగింపు పాటలో రావి వహిత 6.3లక్షలకు దక్కించుకొన్నారు. కోలాటాలు, భజనలు, కోయ నృత్యాలు, బేతాళవేషాలు, హిరాణి నృత్యాలు, మేళతాళాలతో వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆది దంపతుల కళ్యాణం రాత్రి 2.16గంటలకు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ దంపతులచే కన్నుల పండువగా జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేసింది.




శ్రీరామలింగేశ్వరస్వామి

శివనామస్మరణతో మార్మోగిన ఐలూరు..

తోట్లవల్లూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం ఐలూరు శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచి వేలాదిమంది భక్తులు ఐలూరు తరలివచ్చారు. కృష్ణానదీపాయలో బోర్ల పైపుల కింద జల్లుస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండప్రదానాలు అర్పించారు. రామేశ్వరస్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీఐ వై.చిట్టిబాబు, ఎస్ఐ సీహెచ్ అవినాష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి తదితరులు రామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఘాట్‌లో పదివేలమంది భక్తులు జల్లు స్నానాలు ఆచరించి స్థానిక భ్రమరాంబ చెన్న మల్లిఖార్జునస్వామిని దర్శనం చేసుకున్నారు.




దుర్గానాగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

పెదకళ్లేపల్లిలో పోటెత్తిన భక్తులు

మోపిదేవి : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని దక్షిణకాశీగా పేరొందిన పెదకళ్లేపల్లికి భక్తులు పోటెత్తారు. ఉత్తర వాహిని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తెల్లవారుజాము 2 గంటల నుంచి తరలిరావడంతో ప్రధాన రహదారులు, కృష్ణానది ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. లక్షమందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పితృదేవతలకు పిండతర్పణం గావించి గంగిరెద్దులతో పెద్దలను పొగిడించి ముత్తైదువులు, మహిళలు చాటలు, పసుపు, కుంకుమలు అందుకున్నారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టగా, మత్స్య శాఖ, ఆర్సీ, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఘాట్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా భక్తులకు రక్షణ చర్యలు చేపట్టారు. పంచాయతీల ఆధ్వర్యంలో నిరంతరం పారిశుధ్య చర్యలు పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థలు విశిష్ట సేవలందించాయి. గ్రామానికి చెందిన యార్లగడ్డ శివప్రసాద్ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు, మిత్రులు 10వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. రాజరాజేశ్వరీ ట్రేడర్స్ అధినేత కెవి.ఎన్.కె.కోటేశ్వరరావు, స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో యాసం చిట్టిబాబు, విక్కుర్తి శ్రీనివాస్‌లు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానం తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మచిలీపట్నం ఆర్డీవో కె.స్వామి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లు దుర్గానాగేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

సంగమేశ్వరుని సన్నిధిలో..



నందిగామ రూరల్ : దక్షిణ కాశీగా పేరుగాంచిన దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైరా సంగమంలో పుణ్య స్నానాలాచరించి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు గంటల పాటు క్యూలైన్‌లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. వైరా సంగమం వద్ద పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఈవో నరసింహమూర్తి, సీఐ వైవిఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యు, ఆయా శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

జనసంద్రంలా ముక్త్యాల..

జగ్గయ్యపేట రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముక్త్యాల గ్రామం జనసంద్రంగా మారింది. కృష్ణానదిలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు భవానీ ముక్తేశ్వర స్వామి, కోటిలింగ హరిహర క్షేత్రంలో పూజలు చేశారు. పిండ ప్రదానాలు, తర్పణాలతో పాటు కులదైవాలకు కర్మలు చేశారు. భక్తులకు కెసీపీ సిమెంట్స్, ఉమర్ ఫ్రెండ్స్ సర్కిల్ కోటిలింగాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు.



పెరిగిన నీటి మట్టం.. భక్తులకు తప్పిన ఇబ్బందులు.. కృష్ణానదిలో మంగళవారం రాత్రి వరకు నీరు లేకపోవటంలో కంగారు పడిన అధికారులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో పులిచింతల నుంచి నీటిని విడుదల చేయటంతో బుధవారం పుణ్యస్నానాలకు ఇబ్బంది లేకుండా ఘాట్‌లకు నీరు చేరింది. వాటితో పాటు జల్లు స్నానాలను ఏర్పాట్లు చేయటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు, ఈవోలు ప్రసాద్, సురేష్ బాబు, హరి దుర్గానాగేశ్వరరావు, ఎంపీడీవో నితిన్, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అస్మతున్‌లు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ ఇబ్బందులు

ముక్త్యాలకు భారీసంఖ్యలో వాహనాలు పోటెత్తటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భక్తులు వేలాదిగా బైకులు, వందల సంఖ్యలో కార్లు, ఆటోలు, ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలలో వచ్చారు. అంచనాలకు మించి రావటంతో పార్కింగ్ చాలకభక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు అయోమయానికి గురయ్యారు. విజయవాడ సీపీ రాజశేఖరబాబు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది దాదాపు గంటన్నర పాటు శ్రమించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమం లక్షకు పైగా భక్తుల పుణ్య స్నానాలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఘాట్‌లు పోటెత్తాయి. సాయంత్రం 3 గంటల వరకు సుమారు లక్షకు పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పుష్కరాలను తలపించగా.. వందలాది కార్లు, ఆటోలు వేలసంఖ్యలో మోటార్ బైక్‌లపై తరలివచ్చారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఆర్టీసీ నేరుగా పవిత్రసంగమం వరకు ప్రత్యేక బస్సులను నడిపింది. కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పవిత్ర సంగమం వద్ద ఒంటెల సవారీ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. స్నానాలు ఆచరించిన భక్తులు, పిల్లలు ఒంటెలపై సవారీ చేశారు.


ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ

» కలెక్టర్ బాలాజీ

గుడివాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో విధులు నిర్వహించేందుకు కేటాయించిన సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాలను మూడు సెక్టార్లుగా విభజించి 23 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

» మంత్రి కొల్లు రవీంద్ర


అయ్యప్ప భక్త బృందం ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలందరూ పరమశివుడి అనుగ్రహంతో సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. బుధవారం ఉదయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగులేటి వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులను మంత్రి కొల్లు రవీంద్ర పలకరించారు. ఏర్పాట్లపై అధికారులను, భక్తులను ఆరా తీశారు. బుధవారం ఉదయం మంత్రి రవీంద్ర నాగులేటి ఒడ్డున కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాన్ వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. డీఎస్పీ రాజా, ఇనకుదురు సీఐ పరమేశ్వర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై చర్చించారు. మాజీ మంత్రి దివంగత వడ్డి రంగారావు మనుమడు చిలంకుర్తి ప్రదీప్ ఏర్పాటు చేసిన అన్నదాన పంపిణీ, మోటమర్రి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రసాదం పంపిణీ, గాయిత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు నిర్వహించే ప్రసాదం పంపిణీ శిబిరాలను మంత్రి సందర్శించారు. రసలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తులతో మాట్లాడారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నేత నారగాని కృష్ణ, సనకా నాగులు పాల్గొన్నారు. అలాగే కాలేఖాన్‌పేటలో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తబృందం ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించారు. అనంతరం శివగంగ దేవాలయాన్ని ఆయన సందర్శించారు.

దుర్గామల్లేశ్వరులకు మంగళగిరి చేనేత పట్టువస్త్రాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వరులకు బుధవారం మంగళగిరి శ్రీ శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుంది. దీంతో మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై ఈ



వస్త్రాలను భక్తిశ్రద్ధలతో పవిత్రంగా తయారు చేశారు. ఈ ఏడాది ప్రధాన కైంకర్యపరులుగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు చేనేత పట్టువస్త్ర నివేదన చేశారు. చేనేత పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, విభూది, ఫలపుష్పాలతో ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వారికి దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి ఎం.రత్నరాజు, సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. తదుపరి మల్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళగిరి చేనేత ప్రముఖులు దామర్ల వెంకట నరసింహం, గ్రంధి శివాజీ, అందే నాగప్రసాద్, చిల్లపల్లి మోహనరావు, దామర్ల రాజు పాల్గొన్నారు.

బస్‌రూట్ల వివరాల బోర్డుల ఏర్పాటు

ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దేవస్థానం బస్‌లో కొండపైకి వెళ్లేందుకు బస్ రూట్లు వివరాల బోర్డులను ఏర్పాటు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్, పండిట్ నెహ్రూ బస్టేషన్, దుర్గాఘాట్, కొండపైన తదితర ప్రాంతాల్లో ఈ బోర్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

(5వ పేజీ తరువాయి)

తన ఇంటి నుంచి వచ్చిన మరుసటి రోజే వంశీ తాడేపల్లి వెళ్లి వైసీపీకి చెందిన ముఖ్యనేతలు ఇద్దరిని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై వంశీ స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే.. ఈ మొత్తం ఎపిసోడ్.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే వంశీ, ఆయన అనుయాయులు సత్యవర్ధన్‌ను బెదిరింపులకు గురిచేశారన్న అనుమానాలు కలుగుతున్నాయి. విచారణ మరింత లోతుగా జరిగే క్రమంలో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఊహించని రీతిలో..

వైసీపీ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసం, గన్నవరం, గుడివాడ టీడీపీ కార్యాలయాలపై వరుసగా దాడులు జరిగాయి. ఇవన్నీ వేర్వేరు దాడులే అయినా.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే జరిగాయన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. తాజాగా గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో కూడా తాడేపల్లి పెద్దల ఒత్తిడి ఉందన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. ఈ కేసులో వల్లభనేని వంశీమోహన్ ఏ71గా ఉన్నారు. ఏ71గా ఉండటం వల్ల ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టమేమీ లేదని అంతరంగికంగా పలువురు ముఖ్యులతో వంశీ అప్పట్లో చెప్పినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్దిరోజులకే సత్యవర్ధన్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చాడు. ఇంత వేగంగా పరిణామాలు మారడం వెనుక తాడేపల్లి వైసీపీ పెద్దల ప్రోద్బలం ఉందన్న అనుమానాలు వచ్చాయి. కేసులు ఎప్పుడూ ఉండేవేనని, గన్నవరం నియోజకవర్గంలోకి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు వంశీకి గట్టిగా చెప్పిన అనంతర క్రమంలోనే ఈ పరిణామాలన్నీ చోటుచేసుకున్నాయి. తొందరగా ఈ కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించిన వంశీకి ఊహించని విధంగా వరుసగా కేసులు వచ్చిపడ్డాయి.

వైసీపీ పెద్దలకు షాక్

వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు వంశీ అనుయాయులు సాగించిన అరాచకాలు, మైనింగ్ అక్రమ తవ్వకాలు, భూకబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, బెదిరింపులపై ఇప్పుడు అనేక కేసులు నమోదవుతున్నాయి. తాజాగా వంశీ అక్రమాలపై ప్రభుత్వం సిట్ కూడా వేయటంతో అన్నింటిపై విచారణలు సాగే అవకాశముంది. ఈ హఠాత్పరిణామాలతో తాడేపల్లి పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

ఓటే శాసనం..!

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ డివిజన్‌లో 23,555 మంది ఓటర్లు, ఉయ్యూరు డివిజన్‌లో 21,118 మంది ఓటర్లు, గుడివాడ డివిజన్‌లో 18,440 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా 31 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 77 పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఓటరు స్లిప్పులు అందజేశారు. పోలింగ్ నిమిత్తం 477 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. వీరిలో 94 మంది పీవోలు, 92 మంది ఏపీవోలు, 199 మంది ఓపీవోలు, 92 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, 35 సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందుకు అనుగుణంగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను, వీడియోగ్రాఫర్లను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పోలింగ్ జరిగే విధానంపై నిఘాను ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం తెలిపారు. నలుగురు డీఎస్పీలు, 18 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 82 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 239 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, 70 మంది హోంగార్డులను, మరో 40 మంది ఇతర సిబ్బందితో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సిబ్బందితో పాటు 15 మొబైల్ రూట్లను, సర్కిల్‌కు ఒకటి చొప్పున 13 స్ట్రైకింగ్ ఫోర్స్‌లను, డివిజన్‌కు ఒకటి చొప్పున స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో నిరంతర గస్తీని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీస్ అధికారులు, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారని, అల్లర్లకు పాల్పడే వారిని అదుపులోకి తీసుకుంటారని తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా నేరచరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, నలుగురైదుగురు కంటే అధికంగా గుమిగూడి ఉండకూడదని ఆయన చెప్పారు. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు సమావేశాలను నిర్వహించకూడదన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

42 మద్యం సీసాలు స్వాధీనం - నలుగురి అరెస్టు

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 42 మద్యం సీసాలు స్వాధీన పరుచుకున్నట్టు సీఐ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డ్రై డే అమలులో ఉన్నందున స్టేషన్ పరిధిలో దాడులు జరిపి మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు. ఎస్సై కల్యాణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజయవాడ ఎస్సై రామశేషయ్య, ఈఎస్‌టీ మచిలీపట్నం ఎస్సై సంతోశ్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరమని, అటువంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


బాపులపాడు శివాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు


నున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రుద్రాక్షలతో అలంకరణ, పూజలు


ఉయ్యూరు శివాలయంలో స్వామివారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు

మార్మోగిన శివనామస్మరణ

- మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేకువజామునుంచే శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- విశేష ద్రవ్యాలతో నిరవధికంగా సాగిన అభిషేకాలు, ప్రత్యేకపూజలు
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు
- కన్నుల పండువగా స్వామివారి శాంతికల్యాణం



మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు.. పెదపులిపాకలో..

కంకిపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు బారుల తీరారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారి పాలెంలోని పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా తరలివచ్చారు. మండలంలోని మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి, పిండప్రదానాలు నిర్వహించారు. తహసీల్దార్ భవన్నారాయణతో పాటు 25 మంది గ్రామ రెవెన్యూ అధికారులు, ఎస్సైలు సందీప్, తాతాచార్యులు, పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కంకిపాడు శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనమలూరు : పెనమలూరు మండలంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెనమలూరులోని పెద్ద గుడి, పోరంకి శివాలయం, కానూరు శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. పెదపులిపాకలో సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, ఎంపీడీఓ ప్రణవి భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. చోడవరంలో పంచాయతీ కార్యదర్శి కలపాల శ్రీధర్ భక్తులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పెదపులిపాకలో ముసునూరి శ్రీనివాసరావు, ముసునూరి శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు, పోలవరపు కుమార్ తదితరులు భక్తలకు కావాల్సిన సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఉయ్యూరు : హర హర మహాదేవ, శంభో శివశంకర నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శివరాత్రి పురస్కరించుకుని బుధవారం ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. శ్రీజగదంబా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తుల తాకిడి కనిపించింది. క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించి పూజలు చేసారు. చిన ఓగిరాల, పెద ఓగిరాల, కలవపాముల, బోళ్లపాడు, సాయిపురం, ముదునూరు శివాలయాల్లో భక్తులు సందడి కన్పించింది.

గన్నవరం : మండలంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్తాబాద రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు తగిన ఏర్పాట్లు చేసింది. అనంతరం వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక శ్రీ కాశీవిశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో, దావాజీగూడెం శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కల్యాణ మహోత్సవం జరిపారు. కేసరపల్లి సోమలింగేశ్వర స్వామి ఆలయం, గుమ్మడి క్షేత్రంలోని శివాలయంలో రుద్రాభిషేకాలు జరిపారు.

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం శివరాత్రి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నున్నలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు అనంతరం పదివేల రుద్రాక్షలతో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుద్రాక్షలను ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శివాచార్య డాక్టర్ మామిళ్లపల్లి ఫణికు మార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నున్న గ్రామంలోని గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు, ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహించారు.


తేలప్రోలు విశ్వేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న భక్తులు


ముస్తాబాద రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్ : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక బాపుల పాడు ధర్మకోనేరు శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర్వుడికి ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు బాదంపూడి అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిరవధికంగా సాగాయి. అనంతరం శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండలంలోని శివాలయాలు బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కిట కిటలాడాయి. మడిచర్లలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో తెల్లవారుఝాము నుంచి అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేక పూజలు, తదనంతరం శ్రీనివాస భజన బృందం ఆధ్వర్యంలో కోలాట నృత్యం నిర్వహించారు. కానుమోలు, పెరికీడు, మల్లవల్లి, సింగన్నగూడెం. చిరివాడ, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి.

ఉంగుటూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం తెల్లవారుజామునుంచే ఓం నమఃశివాయ, హరహర మహాదేవ, శంభో శంకర అనే నినాదాలు చేస్తూ భక్తులు స్వామివారి దర్శనం కోసం ఆలయాల వద్ద బారులు తీరారు. దేవాదాయశాఖ పరిధిలోని తేలప్రోలు, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పొణుకుమాడు, ఎలుకపాడు, తరిగొప్పల, ఇందుపల్లి, మానికొండ తదితర గ్రామాల్లో శివాలయాలకు విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న మానవత ప్రతినిధులు

పేదలకు ఆర్థికసాయం

గన్నవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సాయం చేయటం అందరూ బాధ్యతగా స్వీకరించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కర్ర వరప్రసాద్ అన్నారు. గన్నవరం మానవతా సేవా సంస్థ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. ఐదుగురు నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను వారి నివాసాలకు వెళ్లి అందజే శారు. పొట్లూరి రామకృష్ణారావు, వీసం ప్రసాదరావు, మామిడి రాధిక, వివి.కృష్ణమో హన్, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న జనని సేవా సంస్థ సభ్యులు

చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : 100 మంది వృద్ధులకు, మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు జనని సేవాసంస్థ చైర్మన్ బోయిన వెంకటేశ్వరమ్మ తెలిపారు. బుధవారం రామవరప్పాడు జిల్లా పరిషత్ పాఠశాలలో శివరాత్రి సందర్భంగా జనని థెరిస్సా సేవాసంస్థ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అద్దేపల్లి సాంబశివరావు, కొండా, బొమ్మసాని అరుణ, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

గుడివాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదల నిర్మూలన సంస్థ(మెప్మా) మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులను ఆన్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు అన్నారు. కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో బుధవారం ఆన్‌లైన్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాలల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గురవారం జరిగే పోలింగ్‌కు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉయ్యూరు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడి ముక్కల, పామర్రు, మొవ్వ మండలాల్లో 22,326 మంది ఓటర్లు ఉండగా 25 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో పెనమలూరులో 11, కంకిపాడు 3, ఉయ్యూరు 3, తోట్లవల్లూరు, పమిడి ముక్కల, పామర్రు, మొవ్వలో రెండేసి పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్‌కు సంబంధించి ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం ఆర్డీవో హెలా షారోన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రి అందజేశారు. బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రితో పోలీస్ భద్రత నడుమ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఉయ్యూరు తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్డీవో కార్యాలయ ఓవో భద్రు నాయక్ సిబ్బంది పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ చేశారు. కాగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేం ద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించి ఎన్ని కల సిబ్బందికి పలు సూచనలు చేశారు.


ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

బాపులపాడు హైస్కూల్‌లో..


నున్న హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్ : కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏర్పాట్లు బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 2,628 ఓట్లు ఉన్నాయి. హైస్కూ ల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మూడు బూత్‌లను ఓటర్లుకు (నెం:126,127,128) కేటాయిం చారు. పోలింగ్ సిబ్బంది బుధవారం కేంద్రానికి చేరు కున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఓటరు ఐడీ కార్డు లేదా ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు చూ పించి వినియోగించుకోవాలని తహసీల్దార్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

నున్న జడ్పీ హైస్కూల్‌లో..

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్న జడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. గురువారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం అధికారులు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. హైస్కూల్లో రెండు బూత్‌లు ఉండగా మొత్తం 1046 ఓట్లు ఉన్నాయి. ఏడీసీపీ రామకృష్ణ, నున్న సీఐ కృష్ణమోహన్ బూత్ లను పరిశీలించి బందోబస్తుపై సిబ్బందికి పలు సూచ నలు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారం భమై సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉంగుటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పురాతన సంప్రదాయ వైద్యవిధానాల్లో ఆయుర్వేద వైద్యానికి సర్వరోగ నివారిణిగా ప్రత్యేక గుర్తింపు వుందని, ఎలాంటి మొండి జబ్బులనైనా నయం చేసి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధింపజేసే పద్ధతులు ఆయుర్వేదంలో అందుబాటులో వున్నాయని, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అందించే వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తేలప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ టి.లక్ష్మీసౌజన్య అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ పుష్పజా, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


తేలప్రోలు ఆయుర్వేద మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


పతకాలు సాధించిన శ్రీనివాస్ కరాటే అండ్ మార్షల్ అకాడమి విద్యార్థులు

కరాటేలో ఉయ్యూరు విద్యార్థులకు పతకాలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ 2025 పోటీల్లో ఉయ్యూరుకు చెందిన నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో జె సాయిశ్రీవల్లి, ప్రథమ, కే అక్షయ ద్వితీయ, వై శ్రీదేవి తృతీయ స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో ఎన్ ప్రవీణ్ ప్రథమ, అయ్యన్, జె కార్తీక్, పి పునీశ్ ద్వితీయ స్థానాలు గెలుచుకున్నారు. బాలికల వెపన్స్ కటా విభాగంలో జె సాయి శ్రీవల్లి, ప్రథమ, కె అక్షయ ద్వితీయ, వై శ్రీదేవి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలు, వారి కి శిక్షణ నిచ్చిన కోచ్ డి శ్రీనివాస్‌ను కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

గుడివాడలో ప్రధాన రహదారుల అభివృద్ధికి అంచనాలు

గుడివాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పట్టణంలో రహదారుల అభివృద్ధికి తక్షణం డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ ఆదేశాలతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ(మోర్త్) అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. జాతీయ రహదారుల సంస్థ డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్ర నేతృత్వంలో మార్కెట్ సెంటర్ నుంచి నెహ్రూచౌక్ మీదగా స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల వరకు కొలతలు తీసుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి వీధి దీపాలు, రెండు వైపులా డ్రెయిన్‌లు, వాటిపై టైల్స్ తదితరాల నిర్మాణానికి అంచనాలు రూపొం దిస్తున్నారు. బైపాస్ రోడ్డు అభివృద్ధి రెండు వైపులా సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించే పనులు శరవేగంగా సాగుతున్నాయి.


కల్యాణ వస్త్రాలను తీసుకెళుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


గుడ్లవల్లేరులో లక్షరుద్రాక్షల శివలింగానికి పూజలు


కూచిపూడిలో అభిషేకం


పామర్రు శివాలయంలో స్వామివార్ల దర్శనం కోసం బారులు


ఐలూరు వెళ్లేందుకు భక్తులు..

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ

గుడివాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : పరమ శివుడి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలకు సిద్ధించాలని, మహాదేవుడు చల్లగా చూడాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. బుధవారం భీమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల పాల్గొన్నారు. తొలుత దేవస్థాన సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణ వస్త్రాలను శిరస్సుపై ఉంచుకుని వేదపండితులు మంత్రోచ్ఛరణాల మధ్య ఎమ్మెల్యే ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు కోరుతూ అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, టీడీపీ నాయకులు పట్టపు చిన్న, వేదపండితులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. శివరాత్రి సందర్భంగా వేదపండితులను సత్కరించడం పుణ్య కార్యమని, సాక్షాత్తూ పరమశివుడిని పూజించినట్లేనని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె)అన్నారు.

ద్వారకాసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం..

కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో శ్రీద్వారక సాయి సేవా సమితి ఆధ్వర్యంలో దేవస్థాన కమిటీ చైర్మన్ జవ్వాజి గంగారాజు ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమితి అధ్యక్షకార్యదర్శులు దండమూడి సీతారామస్వామి, నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు మరీదు శ్రీనివాసరావు, కోశాధికారి లక్ష్మీ, అన్నదాన కన్వీనర్ వెంకటలక్ష్మీ, భానుమతి, సభ్యులు దండమూడి జయలక్ష్మీ, డిల్లేశ్వరరావు, హైమావతి, అరుణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మోటూరు, బొమ్ములూరు, దొండపాడు శివాలయాల్లో భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు.

కూచిపూడి: మొవ్వ మండలంలోని శైవాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, శాంతి కల్యాణం, విశేష పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చినముత్తేవి అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి, కూచిపూడి బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి, మొవ్వ భీమేశ్వరస్వామి ఆలయాల తోపాటు పెదపాడు, గూడపాడు, అయ్యంకి, మొవ్వపాలెం, కాజ, కోసూరు, నిడుమోలు, యద్దనపూడి గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పుణ్య స్నానాలకు ఐలూరుకు వచ్చే భక్తులకు కూచిపూడిలో పులిహోర, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందజేశారు.

పామర్రు: పామర్రు గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం(శివాలయం), కాపవరంలోని కపర్దేశ్వర స్వామి, ప్రాకెర్ల రామలింగేశ్వరస్వామి ఆలయం, కొండిపర్రు లోని భ్రమరాంబసమేత మల్లిఖార్జునస్వామి, రాపర్ల సోమేశ్వరస్వామి, ఎలకుర్రు చెన్నమల్లికేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మహాన్యాస పూజలు, రుద్రాభిషేకాలు జరిపించుకున్నారు. ప్రాకెర్ల శివాలయం ప్రాంగణంలో రామగుండంచెరువు వద్ద భక్తులు పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. విజయవాడ రోడ్డులోని బుచ్చిమ్మ ఆశ్రమంలోని శివాలయంతో పాటు శ్రీఅంకమ్మతల్లి దేవస్థానంలో మహాశివుడికి ప్రత్యేక పూజాదికాలు చేశారు. పామర్రు శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయాధికారి జె.వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు.

ఐలూరుకు ప్రత్యేక బస్సులు

ఐలూరు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని, కృష్ణమ్మ ఒడ్డున పుణ్యస్నానాలు ఆచరించడానికి పామర్రు నాలుగు రోడ్ల కూడలి నుంచి ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో భక్తులు విశేషసంఖ్యలో ఐలూరుకు తరలివెళ్లారు. మంగళవారం రాత్రి నుంచే బందరు, గుడివాడ, ఉయ్యూరు డిపోలకు చెందిన బస్సుల్లో తరలి వెళ్లేందుకు భక్తులు చుట్టుపక్క గ్రామాల నుంచి నాలుగు రోడ్ల కూడలికి చేరుకోవడంతో పామర్రు సెంటరు ప్రయాణికులతో కిటాకిటలాడింది.

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో లక్షరుద్రాక్షల శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. కౌతవరం గౌతమేశ్వర ఆలయం, వడ్లమన్నాడు, డోకిపర్రు, అంగలూరు, విన్నకోట శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం రాత్రి గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయంలో శివకల్యాణం, లింగోద్భవ సమయం వరకూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

పెదపారుపూడి: పెదపారుపూడి మండలం భూషణగుళ్ల గ్రామంలో ఉన్న రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ చేసి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భగవద్గీత పారాయణం చేశారు. మండలంలోని పలు శివాలయాల్లో స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి.


అవగాహన కల్పిస్తున్న మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు

డ్వాక్రా మహిళలు తయారు చేసే వస్తువులు ఇక ఆన్‌లైన్‌లో : మెప్మా

గుడివాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదల నిర్మూలన సంస్థ(మెప్మా) మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులను ఆన్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు అన్నారు. కైకాల సత్యనారాయణ పురపాలక కళా మందిరంలో బుధవారం ఆన్‌లైన్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్వయం సహాయక మహిళల ద్వారా తయారు చేయబడిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గుడివాడలోని సంఘం సభ్యులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే విధంగా సీవోలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీవోలు, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.


మొవ్వలో పోలింగ్ ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న తహసీల్దార్ మస్తాన్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

తహసీల్దార్ మస్తాన్

కూచిపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు మొవ్వ తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేస్తూ, జడ్పీ పాఠశాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఇద్దరు పోలింగ్ అధికారులు, ఇద్దరు అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ విధులు నిర్వహిస్తారని తహసీల్దార్ తెలిపారు.

పామర్రు: పామర్రు నియోజకవర్గంలో గురువారం జరిగే పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉయ్యూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా పోలింగ్ సామాగ్రిని బుధవారం సిబ్బంది తీసుకున్నారు. బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఎన్నికల సామగ్రి తీసుకుని వారికి కేటాయించిన రూట్లో వాహనాలపై ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది పోలింగ్‌కేంద్రాల ద్వారా 6447 పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. సంబంధిత ఏర్పాట్లను ఉయ్యూరు ఆర్డీవో షారోన్ తహసీల్దార్ గూడపాటి రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బి రజనీకాంత్, ఆర్ఐ రాము పరిశీలించారు.


గుడ్లవల్లేరు పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవోలు ఓటర్ల జాబితాల పరిశీలన

గుడ్లవల్లేరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుడ్లవల్లేరు పోలింగ్ కేంద్రానికి బుధవారం మధ్యాహ్నానికే సిబ్బంది బ్యాలెట్లు, బ్యాలెట్ బాక్స్‌లు సంబంధిత సామాగ్రితో చేరుకొన్నారు. రూట్ ఆఫీసర్ పి.శివకుమార్ నేతృత్వంలో ఇద్దరు పీవోలు ఇమ్రాన్, నిర్మలాసరోజని , ఏపీవోలుగా లక్ష్మీతులసి, నాగేశ్వరరావులను పోలింగ్ సామాగ్రితో గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఏం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తి ఏర్పాటు చేశారు.

గుడివాడ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు గుడివాడ రూరల్ మండలం నుంచి పట్టణంలో బూత్‌లు ఏర్పాటు చేశారు. మోటూరు, చౌటపల్లి, దొండపాడు, బొమ్ములూరు, మల్లాయిపాలెం, లింగవరం, వల్లివర్తిపాడు తదితర మేజర్ పంచాయతీల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటు వేసేందుకు ఏజీకే ఎస్‌పీఎస్ కేంద్రాలకు తరలిరానున్నారు.

తోట్లవల్లూరులో రెండు పోలింగ్ బూత్‌లు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. 145, 146 నెంబర్లతో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, ఇతర ఏర్పాట్లు చేపట్టామని, రెండు పోలింగ్ బూత్‌లలో 1,310 మంది పట్టభద్రుల ఓటర్లున్నారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ భద్రత : డీఎస్పీ

పామర్రు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పామర్రులో ఆయన పరిశీలించి సంబంధిత అధికార్లకు పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే అన్ని మండల కేంద్రాల్లో ఎస్సై స్థాయి అధికార్ల పర్యవేక్షణలో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు బందోబస్తు నిర్వహణకు అవసరమైన స్పెషల్, సివిల్‌ఫోర్స్, మహిళా పోలీసులతో భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. మద్యం అమ్మకాలను 48గంటల పాటు నిలుపుదల చేయడంతోపాటు అక్రమ రవాణా జరగకుండా డివిజన్ వ్యాప్తంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సీఐ శుభకర్, ఎస్సై రాజేంద్రప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.


పామర్రులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్


మొవ్వ క్షేత్రయ్య కళాశాలలో పరీక్ష గదిలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కూచిపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖ్యపర్యవేక్షణాధికారి డి.సుధాకర్ తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 109 మంది, వృత్తివిద్యాకోర్సుల విద్యార్థులు 79 మంది పరీక్షలకు హాజరవుతుండగా, ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుల విద్యార్థులు 93 మంది, వృత్తికోర్సుల విద్యార్థులు 45మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 11మంది ఇన్విజిలే టర్లు మండలంలోని పాఠశాలల నుంచి నియమించినట్లు తెలిపారు. పరీక్షా గదులు, సీసీ కెమెరాల పర్య వేక్షణలో కొనసాగుతాయని, కాలేజీ పరిసరాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందని సీఎస్ సుధాకర్ తెలిపారు.

గుడివాడ రూరల్: మోటూరు గురుకుల పాఠశాల నుంచి మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 64, రెండో సంవత్సరం విద్యార్థులు 70 మంది పరీక్షలు రాయనున్నారు. వీరికి గుడివాడ పట్టణంలోని ఐదు సెంటర్లు ఎంపిక చేశారు. మోటూరు గురుకుల పాఠశాల నుంచి గుడివాడ పట్టణానికి వచ్చి పరీక్షలు రాయటానికి పాఠశాల యాజమాన్యం సకల ఏర్పాట్లు చేశారు.

కరాటేలో ఉయ్యూరు విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన శ్రీనివాస్ కరాటే అండ్ మార్షల్ అకాడమి విద్యార్థులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ మెమో రియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ 2025 పోటీల్లో ఉయ్యూ రుకు చెందిన నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో జె సాయిశ్రీవల్లి, ప్రథమ, కే అక్షయ ద్వితీయ, వై శ్రీదేవి తృతీయ స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో ఎన్ ప్రవీణ్ ప్రథమ, అయ్యన్, జె కార్తీక్, పి పునీశ్ ద్వితీయ స్థానాలు గెలుచుకున్నారు. బాలికల వెపన్స్ కటా విభాగంలో జె సాయి శ్రీవల్లి, ప్రథమ, కె అక్షయ ద్వితీయ, వై శ్రీదేవి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలు, వారి కి శిక్షణ నిచ్చిన కోచ్ డి శ్రీనివాస్‌ను కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి అభినందించారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉంగుటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పురాతన సంప్రదాయ వైద్యవిధానాల్లో ఆయుర్వేద వైద్యానికి సర్వరోగ నివారిణిగా ప్రత్యేక గుర్తింపు వుందని, ఎలాంటి మొండి జబ్బులనైనా నయం చేసి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధింపజేసే పద్ధతులు ఆయుర్వేదంలో అందుబాటులో వున్నాయని, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అందించే వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తేలప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ టి.లక్ష్మీసౌజన్య అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ పుష్పజా, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.485

పోలీస్ స్టేషన్‌లో ప్రేమజంటకు వివాహం



రోహిత్‌రెడ్డి, బాలమల్లేశ్వరి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం తాలూకా పోలీసుస్టేషన్‌లో బుధవారం ప్రేమ వివాహం జరిగింది. బందరు మండలం రెడ్డిపాలేనికి చెందిన మర్రి రోహిత్‌రెడ్డి (21), పెడన మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన బాలమల్లేశ్వరి (20) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో బందరు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. వారి సమక్షంలో వివాహం చేసుకున్నారు.

హరహర మహాదేవ

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు

తీర ప్రాంతాలు, వాగుల్లో పుణ్యస్నానాలు

పితృదేవతలకు పిండప్రదానం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారు జాము నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్ర తీర ప్రాంతాలు, నాగులేటి వాగుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, పలువురు వ్యక్తులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.



మచిలీపట్నంలోని నాగులేటి వద్ద పోటెత్తిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) నాగులేటి ఒడ్డున రసలింగేశ్వర స్వామి



రామలింగేశ్వర స్వామి సన్నిధిలో కలెక్టర్ బాలాజీ



పాత ఎడ్లంక వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా నాగులేటి వద్ద వేలాది భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు చేశారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. మహిళలు చాటల వాయనాలు ఇచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు మునిసిపల్, పోలీసు, ఇరిగేషన్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు సేవలందించారు. నాగులేటి వద్ద ఉన్న రసలింగేశ్వర స్వామిని సుమారు 40 వేల మంది భక్తులు సందర్శించారు. ఆలయం నుంచి కాలువ గట్టు వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవలందించారు. వేలాది భక్తులకు కొల్లు ఫౌండేషన్, మోటమర్రి ఫౌండేషన్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘంతో పాటు పోలీసు అధికారులు ప్రసాదం పంపిణీ చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర నాగులేరును సందర్శించి ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ తదితరులు సేవలందించారు. అలాగే మచిలీపట్నంలోని రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంతో ప్రత్యేక పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామిని కలెక్టర్ డి.కె.బాలాజీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, బచ్చుపేట మల్లేశ్వర స్వామి, గొడుగుపేట శాంతా మల్లేశ్వర స్వామి, చింతగుంట పాలెంలోని శివాలయం, సర్కిల్‌పేటలోని మల్లేశ్వర స్వామి, పెదపట్నంలోని శివాలయం, బీచ్‌లోని దత్తరామేశ్వరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, సనకా నాగులు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ సందర్శించారు. ఈడేపల్లిలోని జోడుగుళ్ల ఆవరణలో మహాశివరాత్రి సందర్భంగా అంగరంగ వైభవంగా స్వామి వారి కళ్యాణోత్సవం జరిగింది.

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని శ్రీదుర్గ పార్వతీ సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధ నిర్వహించారు. బాడిగ శేషగిరిరావు, రామయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. వీఎస్ఎన్ ఆక్వాఫీడ్స్ అండ్ నీడ్స్ ఆధ్వర్యంలో వలవల గోపి, జనసేన ఆధ్వర్యంలో పిన్నెంటి రాంబాబు మజ్జిగ పంపిణీ చేశారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద జనసేన నాయకుడు కూనసాని నాగబాబు తన తల్లి కృష్ణవేణి జ్ఞాపకార్థ మజ్జిగ అందించారు. ఈ శిబిరాలను శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. తొలుత శ్రీదుర్గ పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారిని కాగిత కృష్ణప్రసాద్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఒడుగు తులసీరావు, కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణ పాల్గొన్నారు.



నడకుదురులోని శ్రీపృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు



కృత్తివెన్నులో నాగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు

పెడన రూరల్ : చెన్నూరులోని గంగా పార్వతి సమేత నారద లింగేశ్వర స్వామి, ఉప్పలకలవగుంటలోని నాగేశ్వరస్వామి, చోడవరం లోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, మడకలోని భోగలింగేశ్వరస్వామి, ఉరివిలోని పార్వతి సమేత సోమేశ్వర స్వామి బల్లిపర్రు, నడుపూరు అగ్రహారం, లంకలకలవగుంట, నందిగం శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగాయలంక: సంగమేశ్వరంలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. స్వామివారికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, కోడలు సాయి సుప్రియ విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో సీహెచ్.సుధాకరరావు పర్యవేక్షించారు. నాగాయలంకలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి.

అవనిగడ్డ రూరల్: పాత ఎడ్లంకలోని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ వాసు, ఎస్ఐ శ్రీనివాస్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వేకనూరులోని శ్రీసూర్యనారాయణస్వామి దేవాలయం ప్రాంగణంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి నరసింహమూర్తి బ్రహ్మత్వంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతుల చేతుల మీదుగా జరిపారు. అనంతరం తుంగల సతీష్ తండ్రి నరసింహస్వామి ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు.

ఘంటసాల: ఘంటసాలలోని శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయం, అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామి దేవాలయం, ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏక రాతి ప్రసన్న మల్లిఖార్జున స్వామి సన్నిధిలో మూడు వేల మందికి అన్నదానం నిర్వహించారు. శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) పాల్గొన్నారు. శ్రీకాకుళంలోని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

అవనిగడ్డ: అవనిగడ్డలోని శ్రీరాజశేఖరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఐదు వేల మందికి అన్నసమారాధన జరిపారు.

చల్లపల్లి: నడకుదురు శ్రీపృథ్వీశ్వర క్షేత్రంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు, కుమార్తె శీలం కృష్ణప్రభ-శీలం అశ్వినీకుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సత్కరించారు. చల్లపల్లిలోని శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, లక్ష్మీపురంలోని శ్రీదుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యార్లగడ్డలో పుట్టతీర్థానికి భక్తులు పోటెత్తారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీదుర్గాపార్వతీ సమేత నాగమల్లి కోటేశ్వరస్వామి సన్నిధిలో బారులుతీరారు. పశుసంపదను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఎడ్లబండ్లపై భక్తులు తరలివచ్చారు. ఆలయ ట్రస్టీ, సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

గూడూరు: కంకటావ శివాలయంలో స్వామివారిని అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయానికి వెండి తాపడం

పెడన, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పెడనలోని శ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో వెండి తాపడం ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ సారథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో చేయించిన వెండి తాపడాన్ని గర్భాలయ ద్వారానికి బుధవారం తెల్లవారుజామున సింగరాజు వంశీయులు అమర్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. వెండిని విరాళంగా ఇచ్చిన దాతలను అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్వామి వారి కోసం అభివృద్ధి కమిటీ చేయించిన బంగారు నామాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కాగా శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అర్చక స్వాములు గూడూరు అగస్త్యయ్య, శివదత్త నేతృత్వంలో ఏకవార రుద్రాభిషేకాలు జరిగాయి. విశ్వహిందూ పరిషత్ సభ్యులు దేవస్థానం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దేవస్థానం ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. కాపులవీధికి చెందిన భక్తులు పరమశివుని ప్రభను పట్టణంలో ఊరేగించారు. దేవస్థానం ఈవో జి.వి.కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోనేరు సెంటర్ అభివృద్ధికి కృషి : మంత్రి



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి) : మచిలీపట్నంలోని చారిత్రక కోనేరు సెంటర్‌ను భాగస్వామ్య పద్ధతిపై అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం రాత్రి మంత్రి కోనేరు సెంటర్‌ను సందర్శించారు. నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ పూర్తిగా శిథిలమైందని, కొన్ని షాపుల పైకప్పుల నుంచి పెచ్చులు రాలుతున్నాయని, షాపులు అద్దెకు తీసుకున్న వారు మంత్రికి తెలిపారు. కోనేరు సెంటర్‌లో తమ వాహనాలు ఉంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసేందుకు కొందరు వెళుతున్నారని షాపుల యజమానులు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోనేరుసెంటర్ సుందరీకరణపై అక్కడి షాపుల్లోని వ్యాపారులతో చర్చించారు. ఇతర ప్రాంతాల నుంచి కోనేరుసెంటర్‌కు వచ్చే వారికి తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా దర్శనం



అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలోని సాయినాథుని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం శివుడు, పార్వతీ రూపంలో అర్ధనారీశ్వరునిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.

ఘనంగా జగాజ్యోతి



జగాజ్యోతిని వెలిగిస్తున్న శివరామప్రసాద్

మోపిదేవి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీదుర్గానాగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా జగాజ్యోతి కార్యక్రమం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ శివరామ ప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జగాజ్యోతిని వెలిగించారు. రాజా వంశీయులను నూతన వస్త్రాలతో సత్కరించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జనసేన నేత పాపారావు మృతి



నాగాయలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోనం పాపారావు (50) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాపారావు మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పాపారావు కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందితో ఆర్డీవో స్వాతి
- పోలింగ్ సామగ్రి పంపిణీ
- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆర్డీవో కె.స్వాతి పేర్కొన్నారు. ఉభయ కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. మచిలీపట్నం నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో డివిజన్ పరిధిలోని 29 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి అందజేశారు. ఆర్డీవో కె.స్వాతి ఆధ్వర్యంలో తహసీల్దార్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్వాతి మీడియాతో మాట్లాడారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు గుర్తింపు కార్డులు చూపించాలన్నారు. మచిలీపట్నంలోని హైనీ హైస్కూలులో నాలుగు, సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూలులో రెండు, జైహింద్ హైస్కూల్‌లో రెండు, హిందూ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్దకు పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మెటీరియల్‌తో చేరుకున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత నోబుల్ కళాశాలకు తిరిగి బ్యాలెట్ బాక్సులతో అధికారులు చేరుకుంటారు.



పోలీసులు, పీవోలు, ఏపీవోలకు సూచనలు ఇస్తున్న మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి

పెడన: గురువారం జరగనున్న కృష్ణా గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెడన నియోజకవర్గంలో మొత్తం 4,476 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పెడన మండలంలో 1,390, బంటుమిల్లి మండలంలో 1,321, గూడూరు మండలంలో 950, కృత్తివెన్ను మండలంలో 815 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. బంటుమిల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్‌ను సమస్యాత్మక కేంద్రంగా గుర్తించి అక్కడ పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒక ఏఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించారు. సీఐ నాగేంద్రప్రసాద్ నియోజకవర్గ మంతా పర్యవేక్షిస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు.

అవనిగడ్డ: పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు అవనిగడ్డ నియోజకవర్గంలో సర్వం సిద్ధమైంది. ఆరు మండలాల్లో 10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, 9,014 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు మధ్యే పోటీ జరుగనుండగా, నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండటం, వారు కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉండటంతో వారు ఏ వైపు మొగ్గుచూపుతారన్న విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో మొత్తం 5,449 పురుష ఓటర్లు, 3,565 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పది పోలింగ్ స్టేషన్లలో గురువారం ఉదయం పోలింగ్ జరుగుతుందని అవనిగడ్డ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

చల్లపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చల్లపల్లిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. చల్లపల్లి రాజా కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, ఓటర్ల సౌకర్యార్థ షామియానాలు సిద్ధం చేశారు. పోలింగ్ బూత్ బయట, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చల్లపల్లి మండలంలో మొత్తం 2,024 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు.

కోడూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు కోడూరు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి శ్రీను నాయక్ తెలిపారు. 195, 196 పోలింగ్ బూత్‌లో ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. కోడూరు తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న శ్రీ శక్తి భవన్, ఉర్దూ పాఠశాలలో ఈ రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మోపిదేవి: శాసన మండలి ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 1,183 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎం.వాణి తెలిపారు.

నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాలలో గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు.

భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని పాత ఎడ్లంకలోని బాలకోటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని బొబ్బా గోవర్ధన్ ప్రారంభించారు.

కోడూరు: కోడూరు మండలం నుంచి శివరాత్రికి పెదకళ్లేపల్లి వెళ్తున్న నాలుగు వేల మంది భక్తులకు బడేవారిపాలెం గ్రామానికి చెందిన శ్రీ వీరాంజనేయ రియల్ ఎస్టేట్ అధినేత బడే వీర వెంకటరావు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత బడే వెంకటేశ్వరరావు, బడే వీరాంజనేయస్వామి జ్ఞాపకార్థం నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు వీర వెంకటరావు తెలిపారు.

చల్లపల్లి: స్థానిక బస్టాండ్ సెంటరులో జనసేన అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బొబ్బా గోవర్ధన్